శ్రవ్యనాటిక :

పొలం పని

శ్రీ వెల్దుర్తి మాణిక్యరావు

[కోడి కూస్తూఉంటుంది]

రామయ్య : దీని కేం పని లేనట్టున్నది, కూస్తున్నదప్పుడే. ఇక నిద్ర పూర్తి అయినట్టే లేదు. కండ్లరెప్పలు బరువుగ లేస్తున్నాయి. ఏమన్నగాని, నాకు తెలిసైంది. దాన్ని గూడ లేపుతా—ఏమేయ్!—ఇగో! — లేవేయ్ అంటే!

మల్లమ్మ : ఊ!—ఎంటిదీ మోటుతనం— కొంచెం పండుకోనియ్యి.

రా : ఇంక అద్దరాత్రనుకున్నావా ఏంటిది! కోడి కూసింది—కోడీ!—తొలికోడి!

మ : ఊకె బొంకకు. రెండు కూగ్కలన్న దీసినట్టు లేదుగని, కోడికూసిందంట—కోడి! కలగిట్టపడలేదుగద—లేకుంటె కలవరిస్తున్నావా?

రా : అవు. పిల్లకు కంటినిండ నిద్రపట్టలేదని కోడి కుయ్యకుంటనే కూకుంటుంది. పొద్దుకూడ పొడుసకుండనే ఉంటుంది.

మ : ఏదీ ఎవలకోసం ఆగదు. లేస్తనిగ తీ.

రా : ఆ—గట్ల తొవ్వకు రా— నెగడు రాదుకున్నదేమో సూడు—సుట్టమీద కింత ఇంగలం పట్కరా.

[నెగడులో కట్టెలు జరిపిన చప్పుడు]

మ : అయ్యో! నెగడు చల్లారిపోయింది. రాత్రి చినుకులు పడితే నాన్పిదమ్మా అనుకున్న. సాలేటి ఆననే దంచినట్టున్నది. కప్పలేసిందేమో—నెగడు సల్లారిపోయింది.

రా : ఏదీ సూతాం—అయితే ఉప్పరెంకయ్యను పిల్చి చూపించాలె. నాల్గుదినాలుగా లేదు షల్లుకప్పి. కూలోండ్లతొ టె గిదె తంటు. కూలి పైకము తీస్కొ నేదె పరిగ నేకనీ—రెక్కవంచి పనిజెయ్యాలంటే పానంమీదికి వస్తది.

మ : మన్నుపెట్టి నిదానంగ పనిసెయ్యకుంటె ఈళ్లకు పైస ఎల్లు షైనబెట్టదోనంట—ఏదీ-జల్దిచకముక గొట్టు, నీకు సుట్టమీదికీ, నాకు పొయ్యిలోదేసేతందుకు. ఇద్దరి పని ఎల్లుతది.

[చకముకి కొడ్తాడు]

రా : నీవు పిల్లగాన్ని లేపు. కోలుకాడికి పోతె బాగుంటుంది. కూరగాయలమడి, ఉల్లినారు, గిట్ట చూసి వస్తుండె. నేను కొట్టంలకి పోతున్నా.

మ : అట్లనే తీ—నువ్వయితె బో.

[రామయ్య పోతాడు]

ఆ దెక్కడి మాట. కోలతేతాం రా అంట ఆడకట్టోల్లు పట్టుకపోతే పోయిండు కొడుకు. ఆడుకోని ఇంటి కొచ్చెటాల్లకు అద్దరాత్రి అయింది. అల్సిపోయిండు యాల్లపూట పండుకున్న ముసల్దాన్ని, నాకే నిద్ర సాలనట్టున్నది. పడ్డుసుపానం! పొల్లగాని కెట్లుండాలె!— ఊ!—పోతడుగని తీ, తెల్లారినాంక. ఇప్పటంత మున్గిపోతున్నది ఆడ!

[రామయ్య తిరిగి వస్తాడు]

రా : పిల్లగాడు లేవలే ఇంక. అగో! నువ్వు కూడ ఇక్కడ్నే కుచున్నావు...ఎచ్చగ కాపుకుంట!

మ : కొట్టంలో నీపని అంత అయినట్టే మాట్లాడుతున్నవు.

రా : అట్టి పెడ్తనుకుంటివా నీ మన్నుకు! ఆడిగోజలను లేపిన. దుడ్డెను—బర్రెను—ఏరే ఏరే గుంజలకు కట్టేసిన. మొన్న అలుక్చిన కోడెను—పొట్టి కొమ్ముల గిత్తను, కోటకాడికి నర్సయ్య కొట్టుక పోతడేమోనని, ఈవల్కి కొట్టుకొచ్చి కిట్లశెట్టుకు కట్టేసిన—అతగాడింక లేవకనన్నసాయె!

మ : ఆడకట్టోల్లు ఆటకోసానికి ఈడ్చుక పోయింది గుర్తే ఉండె—ఇంకా లేవలేదంటవు!—అది పోనిగని, దీనికేమనాలె నిన్న; నిన్న రాత్రి ఇంత ఆనగొట్టింది గుర్తే ఉండె— మోటగొట్టటందుకు! ఎడ్లను తీస్కరాకడా సరే —మోటకోలుకు కొట్టుకపోకడా సరే!

రా : నీవద్ద నే ఎడ్డోన్నయిపోతి!— (ఇద్దరూ నవ్వుకుంటారు). అవుగని, బర్రెనన్న పిడుతవా, అదీలేదా, దానికేమన్న గిట్లనే సెప్తవా?

మ : తెల్లారలేదు—మొదలైంగేమో ఇగ, నావంతు పని నేను శెయ్యనన్ననా? ఎచ్చగ కుంపటిముందు ఎంతకు కూసున్నదిరా ఇది అనిపిస్తున్నదిలే నీకు? నువ్వు దెచ్చిన సన్నటి పాలమూరుగొంగడి కప్పుకుంటె శెంటలొస్తున్నాయి—అబ్బ—

రా : మా అత్తగారు పెట్టిన పట్టంచుదోతులు శిలుకుండలకు తట్టుకుంటున్నయి!

మ : మీ మొగోల్లకు ఎం తిచ్చినా ఆస తీరదు. కావాలె, కావాలె, అనే మాటనే. ఇంతకీ ఏం తక్వ శేశింద్రు అంట మావోల్లు? ఇంతకంటె ఎవరెక్వ పెట్టింద్రో—ఏది చూపియ్యి. ఎనక్కటి దంత యాజ్జేసి నాకు కోపం దెప్పియ్యకు!

రా : బల్లి తీర్గ మాటకు మాట గుంజకు! కోడలుపిల్ల నన్న లేపి కుండలకాడికి తోలు. నువ్వు పాలు పిండబో—పని జర్గుతుందని.

మ : నువ్వన్నట్టు పొద్దుపొడిస్తె పుట్టెడు పన్లు. లచ్చువా!...ఓలమ్మా! లెవుబిడ్డ— లెవు. తెల్లార్తున్నది.

లచ్చు :...ఆ...అస్తున్న అత్తా.

[గదిలోంచి వస్తుంది]

అత్తా! మడిదకొంగుకింద అగ్గేసి, కుండలు కడిగెలంకుకు పోదునా.

మ : పో—కని, పాలకుండలు మొదలు కడుగు. అట్లనే పాలదాయికూడ రాజెయ్యి.

[రామయ్య కొట్టంల కెల్లివస్తడు-అంబా అంబా అంట ల్యాగలు ఒర్లుతయి. నర్సయ్య తేచిన స్తడు]

రా : లేసినావు బిడ్డ-దా - కూసో — కొంచెం బిరాన లేసుంటె, కోటకాడికి పోతుంటివేమో అనుకున్న.

నర్సయ్య : ఇప్పటికైనా ఏసుంత ఆలస్యం గాలె. పోతె పొద్దున్నది. కనీ, నన్నడుగుతె, ఈయాల్ల రేపు ఆ మాటనే వద్దంట. ఎల్లుండి అంగడి.పొద్దున్నె పోయి గంపెడు ఉల్లగడ్డ తెస్త. చుట్టోర్గ నాటిన కంపకు ఏమన్న బీరపిందెలు పడొచ్చు. అవ్విగూడ తెంపుకొస్త. ఒక్క పెట్టున అమ్మితె, శేతినిండ యాగాండ్లు కంప్లెబడతై. బర్కతుంటది. ఇప్పడు కలుపు సంగతి చూస్కోవాలె మనం.

మ : లేసినావు బిడ్డ—నువ్వు లేవలే దని మీ అయ్య ఇది జేస్తున్నడు. కలుపుమాటనే మాట్లాడుకోండి.

న : నేనూ ఆ మాటనే తీస్తున్న. ఈయాల్ల రేపు కలుపు ఎల్లకుంటె, పంట శేతికి రాదనుకోవాలె.

రా : నేను అద్దూ అంటున్నాను. శాతనైనంత శేస్తనే ఉంటి. రెండు దినాల సంది, మాలోల్ల ఆడకట్టుకు—తెన్గోల్ల ఆడకట్టుకు తిర్గి నోన్ని తిర్గినట్టే. భతిమిలాడ్తి—బామాడ్తి. రాకపోయిరి. "నీకేం పో! పదిమందిని తోల్కని సక్కంగ మీ పొలాలకే అస్తిమి" అన్నది. కూసున్న, కూసున్న. మూడుమాట్లు సుట్ట నింపుకున్న. 'ఇగో ఇది రాదు!—అగో అది రాదు!' అనబట్టె.

న : ఎక్వరే అది

రా : బాలవ్వరా—నూలమీద ఉంటది సూడు—శాదబాయిపక్కకు.

మ : కొమ్ముబాలవ్వా అను. అది అసుంటిదే. ఎప్పుడు జూసినా అగావు కూల్లు తీస్కుంటది. మందిని జోపుకొస్తనంటది. కాని, దాందగ్గిర ఇంకో పాడుగునం మిడ్కిపోయింది. దినదినం కూల్లు పెంచుతది. ఎక్వకూలిస్తేనే పనిమీదికి పోవాలంట తిగ్గతది—ఎంతో పని ఉన్నట్టు!

న : ఎట్ల మాట్లాడ్తవే అవ్వా! దాందా పాడుగునం - మనదా? నేను తక్వడేస్తానంటె నేను మానెడేస్తా అనుకుంట అల్ల ఇంటిసుట్టు తిర్గి నేర్పుతున్నది మనఅసుంటోల్లే. పెద్దమాట గర్జు మనది. ఎట్లున్నన్న పని ఎల్లగొట్టుకోవాలె.

రా : అ అట్లడిగినంత ఇచ్చుకుంట కూసుంటె, బాగనే శేస్తం సంసారం.

మ : నాకు ఇసుంటి ఇచ్చులు, కచ్చకాయలు తెల్వవు. మన అసుంటోల్లు ఊల్ల ఎందరు లేరు. అందరితోటి మనం.

రా : ఎవరు కాదంటడే మరి. ఎంకటయ్యను, రంగయ్యను పిల్చుకొస్త. అల్ల పొలాలు, మన పంపుల్నే ఉన్నయిగద. కలుపు అల్లదీ ఎల్లలేదు. అందరం కల్సి యోశనశేతాం. ఎట్లా అంటె అట్ల.

మ.న : పోయి తోల్కరా పో.

న : ఈయాల్ల ఏదో మాటకు రావాలె. ఇట్లో—అట్లో—

[వెంకటయ్య, రంగయ్యల్ని తోలుకొని రామయ్య వస్తడు]

మ : లచ్చా! వెంకడెయ్య బిడ్డా, రంగన్న గిట్ల అస్తున్నరు. కొట్టంల నర్సయ్య ఉన్నడేమో పిల్సుకొస్త.

[పోయి నర్సయ్యను పిల్చుకొస్తుంది]

న : సెప్పరూ—మీ పొలాల సంగతి. కలుపు సంగతి ఎటున్నది?

రంగయ్య : అన్ని గట్లనే ఏడ్సినై.

ఎంకటయ్య : మన ముగ్గిరి పొలాలు ఆందాల పిల్లలనుకో!

[అంతా నవ్వుతారు]

[ఇంతలో లచ్చుఅన్న సోమయ్య వస్తడు]

సోమయ్య : బాగున్నారు మామా?

రా : గిట్లున్నం దేవుని దయతోటి. అంతా బాగున్నరా?

సో : ఆ!

మ : లచ్చువా! మీ అన్న అచ్చిండే ని వద్దనే. కాల్లకు నీల్లు తీస్కరా!

ల : (సీలిస్తూ) అన్నా—ఇంటికాడ అంత బాగున్నరా?

సో సో అంత బాగున్నరు.

రా : ఎట్లో వచ్చినవు అల్లుడా!

సో : మొన్న పోయిన విగ్రానికి ఇంటికోడెనో దాన్ని అలమరిపింటి. దానిక్తోడు ఓ గిత్తను కొందామని నార్సంగి అంగడికి పోతున్న. ఎట్లనో ఓ బండిని నిలబెడ్తామని ఉన్నది. తీరికె ఉన్నప్పుడు బాడిగె కొట్టుకుందామనుకుంటున్న.

రం : యోశనతోటి ఏదో శేస్తుంటె నే సంసారం నడుస్తది.

ఎం : ఈగలు కొట్టుకుంట కూసుంటె, జర్గతాదయ్యా!

న : బలె సమయాని కొచ్చినవు బావా! కలుపులు కాకపాయె. కులం జర్గబట్టె. కూల్లు పెర్గతుండ్రె, ఎం జెయ్యాలె అంట అనుకుంటున్నం.

రం : పెద్ద ఎగసం ఉన్నోల్లు పెంచుతున్నారు.

రా : 'ఇదే పని' అంట ఈల్లు గుంజుతున్నరు!

న : బావా—మీదగ్గిరి సంగతి చెప్పకపోతివి.

సో : మూడునాల్గు బిగాలున్నటోల్లమే ఇట్ల కిందమీద పడ్తుంటె, 20—30—నాగండ్లు, కట్టెటోల్ల నెత్తిమీద ఎంత బర్వ ఉంటాచ్చు? అయినగని, పున్యాని కెవడు తోడిపెడ్తడు!

రం : సోమయ్యమాటినవద్దనే అనిపిస్తది. పెడమీదకొస్తెనే, ఎవడైన చెయ్యి వొదలు చేస్తడు.

ఎం : అడ్డెకు పోయి కుంచెడాయె. దినదినం అన్యాన్న తోకతీర్గ పెంచుకుంట బోతె నెట్లవయ్యా?

మ : ఇంకా అయిన ఏమనుకున్నరు. బారెడు పొద్దెక్కినాక అస్తరు—అనువేసుకుంట, పొగాకు నములుకుంట. అదో ఝూకు శేస్తరు పగలు, మూరెడు పొద్దుండగనే కలవార్గ బొడ్లె శెక్కుతూఉంటరు.

సో : ఇంటోల్లు ఎంబడి ఉండుకుంట, మంచిగ పని తీస్కోవాలె. రెక్కాడ్తెనే బుక్కాడ్తది గద. యాడాదికి పన్నెండు నెల్లు, నిత్తె, తప్పకుంట కూలి దొర్కుతదా అంటె, ఎగుసంల పనిజేసే కూలోల్లకు అదీ లేదు.

ఎం : కలుపులు ఎల్లినయంటె, కోతలదాంక పుర్సతు.

సో : అందుకే అంటున్న. రేపటి కింత మిగిలించుకోవాలని కూలి ఎక్వజేస్తరనుకుండి. అడ్డకమ్మర్గ దగ్గిర, ఉప్పరి కూల్లు, గిర్నిలల్ల కూల్లు, ఒక్కతీర్గ జర్గతయి. మన ఎగుసంపని అట్ల కాదుగద. అందరం ఒక్కసారి అల్కితిమి. ఒక్కసారి మొలుస్తయి. కలుపూ ఒక్కసారే తియ్యాలె. ఒక్కసారే కొయ్యాలె. అందుకనే ఈ గుంజులాట.

రం : శిన్నోడైనా, సోమయ్య ఖరాగా చెప్తున్నడు.

రా : అడిగినంత ఇస్తాంగనీ — అంతో ఇంతో ఇచ్చి ఎట్లనో పని ఎల్లదీసుకున్నోడే బుద్ధిమంతుడు.

రం, ఎం : ఇక పోతాం రామన్న—

[పోతారు]

న : అవ్వా! నాకో ఉపాయం దోసిందే. నేను కోలుకాడికి పోయి ఉల్లిగడ్డ శీకిపెడ్త. కోడలును బిరాన తోలింపు. నేను, బా, అదీ కల్సి, 30 - 40 కట్టలు కట్టుకోని. సక్కంగ బెస్త ఆడకట్టకు కాతాం. ఇంటికోకట్ట ఇస్తనిన్న ఉన్న కూలి తీస్కొమంట. ఎట్ల రారో, మాస్తగదూ ఎట్లున్నదో!

సో : అదిగేదమన్నదె—అత్తా, నువ్వు మామా కలిసి ఇంకో 30—40 కట్టలు కట్కరండి. పొద్దుపోకె, కూల్లు ఏసేటప్పుడు, ఇంకోకట్ట ఇట్టుకోటి అంటకద్దారి.

రా : అట్లనే సేగాం. ఏదో ఉపాయాన్ని శేసి పని ఎల్లగొట్టుకున్నోడో బుద్ధిమంతుడు ఈయాల్ల రేపు.

[తెర్వాలి పొలంలో కలుపుతీసెటప్పుడు]

వంకాయ తోటకాడ
వరుసలొద్దు—
మొల్క చల్లుతుండంగ
గెల్కవద్దు
కలుపుతీస్తుండంగ
కజ్జమొద్దు—
సాట్లోల్లు ఉన్నకాడ
సరసమొద్దు—
కల్లంలో రాసికాడ
కయ్యమొద్దు
వెన్నెట్లో వన్నెకాడ
విరసమొద్దు
వంకాయతోటకాడ
వరుసలొద్దూ...........

[హైదరాబాదు రేడియో సౌజన్యంతో]

రూపాయ విలువ తగ్గింపువల్ల
ఖరీదు 5% పెరిగింది.
అయినా మునుపటి ధరలకే ఇవ్వబడుతున్నవి.



5 రాళ్ల క్రోంకేసు రు 35/- రోల్డుగోల్డు రు 40/-
7 ,, ,, రు 40/- ,, ,, రు 48/-
15 ,, ,, రు 55/- ,, ,, రు 70/-
నెం 10A తొమ్మిది రాళ్ల రు 14/8-
మేలురకం రు 16/- అలారం టైంపీసు రు 13/-
మంచివి రు 10/- రిపేర్డ్ రు 18/-

ఒకేసారి 3 వాచీలు కొనిన -రూపాయికి 2 అణాలు వంతున కమీషన్ యివ్వబడును.

H. DAVID Co.,
Post Box No. 11424, Calcutta.